
# నిధి



గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

**ఖణ్** ...ఖణ్

రెండోసారి కూడా 'ఖణ్' శబ్దం వచ్చేసరికి పలుగు ఇహ దింపటం మానేసి దాన్ని చటుక్కున పక్కకి పడేసాడు రామేశం. దర దరా, అంతవరకూ తను తవ్విన మట్టిని, గోతిలోంచి పైకి తట్టతో ఎత్తి పోసేసాడు. నాలుగైదు నిముషాలకి బయట పడింది — కిలుము పట్టిన ఇత్తడిపెట్టె - సుమారు అడుగు వెడల్పూ, మూడడుగుల పొడుగూ అంతే వెడల్పుగల ఇత్తడిపెట్టె దానిమూత బిగిసిపోయింది. ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ పొంగిపోయాడు రామేశం. అతి కష్టంమీద ఆ బరువు పెట్టెని గోతిలోంచి పైకెక్కించాడు.

అతని భార్య ఊళ్ళో లేదు. పిల్లలు పక్కగదిలో నిద్రపోతున్నారు. డెబ్బయేళ్ళ విధవతల్లి వాకిట్లో వసారాలో నిద్రపోతోంది. అర్ధరాత్రి సుమారు రెండుగంటల సమయం.

రామేశం హడావిడిగా వెళ్ళి తల్లిని లేపాడు. "అమ్మా అమ్మా నిక్షేపమే, నిక్షేపం! ... నిద్రపట్టక వంటింటి గొయ్యి వెడల్పు చేద్దామని పలుగు పుచ్చుకొనేసరికి ఇత్తడి పెట్టె బయట పడింది. లేవ్వే,లే!'

తల్లి లచ్చమ్మ కంగారు పడుతూ మెలకువలోకొచ్చింది. అంది
యట పడిందా నాయనా ! ఇన్నాళ్టికి మన దరిద్రం తీరింద. మీ
యనగారు చెబుతూండేవారు, ఈ ఆవరణలో ఎక్కడో నిధి ఉందని
రి తండ్రితాతలు అనుకునేవారని ! ... పద"

రామేశం వీధి తలుపు గడియల్ని దొడ్డి తలుపు గడియల్ని ఓ
ాటు చూసొచ్చాడు. వంటింట్లో పాతగోడల్ని పడగొట్టి కొత్తగోడల
నాదుల కోసం ఆ ముందు రోజులతా ఉప్పరవాళ్ళు అక్కడ తవ్వి
సారు. అంచేత తాత్కాలికంగా వంటగదిలోని కరెంటు తీగెల్ని
సేసాడు రామేశం. ఇప్పుడే పెట్టెని పరిశోధించటానికి లాంతరు
ంతి చాలదు. కనక రామేశం, తన పడగ్గదిలో ప్లగ్ తగిలించి,
బిల్ లైటు తీసికెళ్ళి గోతి పక్కన పెట్టుకున్నాడు.

లచ్చమ్మ పెట్టెపక్కకొచ్చి కూర్చుంది. అంది. ఇత్తడి పెట్టా!
ంకేవయినా మిగిలిపోయాయేమో చూశావురా !"

రామేశం మెరుపు వేగంతో గోతిలోకి దూకాడు. గునపంతో
ి చుట్టుపక్కల వీలైనంతమేర గబగబా లోతుగా పోట్లేసిచూశాడు.
'ఇంకేవీలేవ్" అంటూ పైకొచ్చేశాడు.

గుంద్రాయితో ఆ పెట్టె మూతని అన్ని పక్కలా నెమ్మది
నెమ్మదిగా కొట్టాడు. కాస్సేపటికి మూత తెరుచుకుంది. దాన్ని పైకెత్త
గానే గుప్పుమని విచిత్రమైన వాసన కొట్టింది. ఏవో మూలికల కట్ట
కనబడింది. దానికింద పాతకాలపు రాగి ముద్రఉన్న కాగితం మీద
తెలుగులో రాసిన ఉత్తరం ఉంది. రామేశం "అమ్మా ! ఏదో ఉత్త
రమే !...గ్రాంధికంలో ఉన్నట్టుంది

మామూలు తెలుగులో చదువుతానూ..." అని చదవసాగాడు.

• • •

"శ్రీరామ — క్రీస్తుశకం 1890 వ సంవత్సరం విజయదశమి
దినాన నేనీ ఉత్తరం రాస్తున్నాను. గోదావరికివచ్చిన వరద కారణంగా
నా తండ్రి తాతలనాటి స్వస్థలమైన ద్రాక్షారామం నీటిలో మునిగి
పోయింది. నాకున్న కొద్ది ఆస్తీ ఆ నీళ్ళలో కొట్టుకుపోయింది. జీవిక
కోసం నేను ఇక్కడికి రాక తప్పలేదు. సబ్ కలెక్టరు గారైన టేలరు
దొరవారు స్థాపించిన స్కూల్లో పండితుడిగా నాకు ఉద్యోగం దొరికింది.
వశిష్ఠ గోదావరీ తీరాన ఉన్న ఈ నరసాపురమే నాకిక స్వస్థలం.

అయితే నా మనస్సులోని ఆవేదన వర్ణనాతీతం ! నేను
పుట్టింది వేదపండిత వంశంలో. చదివింది వేదవిద్య. ప్రజల్లో
ధర్మానుష్ఠానాగ్ని ప్రజ్వరిల్లుతూండేట్లు చూడటం నా విధి. కానీ ఆంగ్లేయ
విద్యాసక్తులైన శిష్యుల్ని ఇప్పుడు నేను తయారుచేస్తున్నాను. ఈ
స్కూల్లో మెట్రిక్యులేషన్ విద్య చదివితేనే సర్కారువారి ఉద్యోగం
వస్తుందిట. ఈ చదువుకే లోకంలో గౌరవం అంతకంతకూ హెచ్చు
తోంది. చదివినట్టు రాయని, రాసినట్టు చదవని ఈ ఆంగ్లభాషలోనే
ఇక్కడ విద్యాబోధన జరుగుతోంది. ఎట్లాగైనా తంటాలుపడి దాన్ని
నేర్చుకోవటమే పరమావధిగా విద్యార్థులూ తల్లితండ్రులూ భావిస్తున్నారు.

భాష మాత్రానికే నేను బాధపడేవాణ్ణికాదు — రెండు మూడు
వందల ఏళ్ల కిందట అరబ్బీ, పారశీ పదాలు ఎన్ని వచ్చి తెలుగులో
కలవలేదు కనక ! కానీ ఈ ఆంగ్లభాష ద్వారా నేర్చుకొన్న విద్య
మన దేశీయ సాంప్రదాయాలపట్ల ఏహ్యభావాన్ని ప్రబలింపచేస్తోంది.
ఆంగ్లేయ నాగరికతపట్ల గౌరవాన్ని వృద్ధిచేస్తోంది. ఈ వాతావరణాన్ని
ఉపయోగించుకుని క్రైస్తవం వ్యాపిస్తోంది. అసలు క్రైస్తవం వ్యాప్తి
కోసమే ఈ విద్యను ఆంగ్లేయులు రుద్దుతున్నారేమో ననిపిస్తోంది.
ఇదేపరిస్థితి కొనసాగితే కొన్నాళ్ళకి రామాయణ భారత భాగవతాదులూ,
వేదశాస్త్రాలూ మనకిహ మిగలవేమోనన్న భయం నన్ను పీడిస్తోంది.

ఎవరో వివేకానందుడట. గాంగాతీరపు సన్యాసి అట. సనాతన
ధర్మాన్ని ఆధునిక పద్ధతిలో బోధిస్తున్నాడట. కానీ కొందరు ఛాందసులు
ఆయన హెచ్చరికను అపహేళన చేస్తున్నారట. బ్రాహ్మణ, క్షత్రియ
కులాల ఆధిక్యతను అంగీకరించని ఏ సిద్ధాంతాన్నీ వాళ్లు ఆమోదించరట.
ఢిల్లీశ్వరోవా జగదీశ్వరోవా అంటే జగదీశ్వరుడనే వాళ్ల వాదనట! ఆహా, ఎట్టి దుర్దినాలు!
మహారాష్ట్ర విజయనగర సామ్రాజ్యాలు తుడిచిపెట్టుకుపోయింది ఈ
పాశ్చాత్యమూకలవల్ల కాదా ! వర్ణవ్యవస్థలో ఏషాన్ని చిలికి, దాన్ని
కులవ్యవస్థగా మార్చి విషవృక్షంగా పెంచి పోషించింది ఈ ఢిల్లీశ్వరులు
— కాదు, రాక్షసేశ్వరులు — కాదా ? నాకా వివేకానంద
పరివ్రాజకుడి దర్శనమయితే ఎంత బాగుండును ?

అసలెప్పటికైనా నా దేశం పరాయిపాలన నించి విముక్తమవు
తుందా ? ఈ దోపిడీరాజ్యం నశించి ఎప్పటికైనా రామరాజ్యం
ఇక్కడ విలసిల్లుతుందా? — విలసిల్లుతుందనీ, ప్రపంచానికంతకీ
మార్గదర్శమవుతుందనీ ఏదో శక్తి నాలో నినదిస్తోంది.

ఇంత తెలిసినా నా కొడుకును నేనిప్పుడు ఈ హూణవిద్య
లోనే ప్రవేశపెట్టక తప్పలేదు. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్'
కదా ! కానీ, నా వంశంలోంచి ఎవరో ఒకరు తిరిగి సనాతన ధర్మ
రక్షణ కోసం కంకణం కట్టుకుంటారని నాకు తెలుసు ! ఎందుకంటే,
మహాతపస్సంపన్నులైన ఋషుల రక్తం నాలో ప్రవహిస్తోంది కనక!
ఏవేవో క్షుద్రమహత్తులు చూపటం కోసం కాక, విశ్వకల్యాణంకోసం
ఆ ఋషులు తమ తపస్సును ధారపోసారు కనక!

ఈ ఆశతోనే, ద్రాక్షారామంలో వరదల్లో నా పెరట్లో బయట పడిన ఈ నిధిని భద్రంగా మోసుకొచ్చాను. నా పూర్వీకులెవ్వరో రాగిరేకుల మీద ఈ నిధినిగూర్చి శాసనాలు రాసి నిధితోపాటు ఈ పెట్టెలోనే పెట్టించారు. ప్రాకృతమూ, ఇటీవలి తెలుగూ సంస్కృతం లిపులూ తెలిసిన పండితులచేత నేను ఆ శాసనాలని ఈనాటి తెలుగు లోకి అనువాదం చేయించాను. ఈ కాగితాలను కూడా నేను ఈ పెట్టె! లోనే పెడుతున్నాను.

ఈ నిధిని నేను వాడుకోలేను. నా కుమారుడికి అప్పచెప్పలేను ఎందుకంటే, దొరలకు తెలిస్తే దీన్ని సర్కారు లెక్కల్లో దఖలు చేస్తారు. ఆతర్వాత తమ దేశానికి తరలించుకు పోతారు. అట్లా కోన సీమలో ఎన్నో జరిగాయి. కనక ఈ పెట్టెను నేను కూడా భూస్థాపితం చేస్తున్నాను. నా పూర్వీకుల ఆకాంక్ష మేరకు ఈ నిధిని నేను ఉపయోగించుకోలేక పోతున్నందుకు నాకెంతో క్షోభగా ఉంది.

ఈ నిధి సన్మార్గుల చేతిలో మాత్రమే పడేటట్టూ, నా జాతి సంపదాభివృద్ధికి తోడ్పడేట్టూ, భగవంతుడు అనుగ్రహించుగాక ! —తథాస్తు—ఓంతత్సత్.

ఇట్లు
భారద్వాజ గోత్రీకుడు - శివప్రసాదశాస్త్రి

• • •

రామేశం మొహంలో రంగులు మారాయి "ఏమిటే అమ్మా ఇదంతా ! ఎవరీయన ? ... ఉత్తరాలు తప్ప ఇక్కడేవీ కన్పించటం లేదే.,. ఇదుగోనేవ్, ఈకింద ఇంకో అర ఉంది. తియ్యనా... అబ్బ రావట్లేదు... మళ్లీ గున్రడాయితో చావగొట్టాలి కాబోలు..."

కొంగుతో కళ్లు ఒత్తుకుంటున్న లచ్చమ్మ చటుక్కున అంది: "ఆగాగరా నాయనా, తొందరపడకు. శివప్రసాదశాస్త్రిగారు నీ ముత్తాత, ఆయన గొప్పదనాన్ని గురించి చాలా కథలున్నాయి... సర్లే పెట్టె తర్వాత బద్దలు కొడుదువుగాని, ఆ శాసనాలేవో చదువు ముందర!" హడావిడిగా రామేశం, పొడుగు మడతతో ఉన్న ఇంకోకాగితం తీసాడు చదివాడు.

• • •

'భారద్వాజ గోత్రుడను, చాముండ ఉపాసకుడను, భృంగీశ్వర ఘనాపాఠిని అయిన నేను ఈశాసనం రాస్తున్నాను. -ఇటీవల ఈ ప్రాంతంలో మ్లేచ్ఛుల సంచలనం ఎక్కువయింది. శాంతి నశించటమే కాక, అశాంతి అనంతమయింది. సుమారు డెబ్బయ్యేళ్లక్రితం శ్రీకృష్ణ దేవరాయలు ప్రతాపరుద్ర గజపతినించి ఈప్రాంతాన్ని గెలిచాడట. ఆ యుద్ధం సైన్యానికీ సైన్యానికీ మధ్య జరిగిందేకాని, ప్రజల ఆచార వ్యవహారాలనూ, ధర్మాలనూ చికాకుపరచలేదు. ప్రజలు బానిసలుగా అమ్ముడుపోలేదు. కారణం, ఆరాజులు సనాతనధర్మానుయాయులు కావటం. కాగా, శ్రీకృష్ణదేవరాయల పాలనలో ప్రజలు సుఖపడ్డారట. అదృష్టవంతులు !

ఆ తర్వాత గజపతిని ఓడించి కులీకుతుబ్‌షా, అతన్ని చంపి అతని కొడుకూ, తర్వాత అతని కొడుకూ, ఇట్లా ఎందరో ఈ రాజమహేంద్రవరాన్ని పాలించారు. నేను పుట్టాక అబ్దుల్లా కుతుబ్ షా, అబుల్ హసన్ తానీషాలు పాలించారు. వీళ్ల పూర్వీకులు వాళ్ళల్లో వాళ్లే దేవరపల్లి వద్దా, ధవళేశ్వరం వద్దా భయంకర యుద్ధాలు చేసుకొన్నారట. వీళ్ళవన్నీ యుద్ధకండూతిగల రాక్షస వంశాలు!

ఈ వంశాలకే చెందిన ఢిల్లీచక్రవర్తి ఔరంగజేబు పాలనలోకి ఇటీవల గోల్కొండ, రాజమహేంద్రవరాలు వెళ్ళాయని తెలుస్తోంది. ఈ ఔరంగజేబుకు అసలు పూర్వీకులు ఎక్కడివారో ఎవ్వరికీ తెలీదు. సనాతన ధర్ములు కారు. కనీసం బౌద్ధులూ జైనులూ అయినా కారు. విగ్రహారాధన వీళ్ళకి గిట్టదు. ఈ చక్రవర్తిసైన్యాలు వచ్చి దేవాలయాలను ధ్వంసం చేస్తున్నాయి. విగ్రహాల అవయవాలను విరగ్గొట్టి వికృతం చేస్తున్నాయి. గురుకులాల్లోకి చొచ్చుకొచ్చి గ్రంథాలను తగలబెడుతున్నాయి. ఆ సైనికులు స్త్రీలను అవమానపరుస్తున్నారు. ఈ అరాచకానికి భయపడి ఉయ్యాలలో పసిపాపలకు ఉయ్యాలలోనే తాళి కట్టిస్తున్నారు ప్రజలు. వాళ్ళమతంలోకి మారకపోతే యజ్ఞోపవీతాలను తెంచి శిఖలను తెగ్గోస్తున్నారు. బలవంతంగా గోమాంసం తినిపిస్తున్నారు. ఇట్లా భ్రష్టం చేయబడ్డవాళ్ళని ఇతరులు వెలివేస్తున్నారు. వాళ్లు గ్రామాలకు దూరంగా ఒంటరి బ్రతుకు వెళ్లదీయవలసి వస్తోంది. పంచమకులమనే పేరుతో అప్పుడే ఇంకో కులం పుట్టింది కూడా.

అయ్యయ్యో ! ఇంక్కెక్కడి సనాతన ధర్మం ! వీళ్ళు నరులు కారు, నరరూపరాక్షసులు! నా తండ్రితాతల దగ్గర నేను విన్నదాన్ని బట్టి ప్రజలను బానిసలుగా చెయ్యటమనేది ఈ మ్లేచ్ఛులు ప్రవేశపెట్టిందేనట!

ఎనభయ్యేళ్ల పండు ముదుసలి నా తండ్రి వేద వేదాంగాల్లోనూ అనేక శాస్త్రాల్లోనూ అఖండ పాండిత్యప్రకర్ష గల మహా తపస్వి. నేటికి నెల దినాలనాడు అర్ధరాత్రివేళ హఠాత్తుగా నన్ను లేపి ఇట్లా అన్నాడు: "నాయనా భృంగీ శ్రద్ధగా విను: నాకు కాలం సమీపించింది. మహానుభావులు మన వంశీకులెవ్వరో తమ జీవితకాలం అంతా శ్రమించి కూడబెట్టి దాచిన నిధి అదృష్టవశాత్తూ నాకు దక్కింది. ఆ మేరు సముద్ర పర్యంతమూ సమస్త మానవాళినీ సుఖపెట్టగలగేటంతగా

తరగని నిధి అది. ఇటీవల నేను యాగకుండం కోసం నేల తవ్వుతూండగా బయటపడింది. సాంఖ్యాయన సోమయాజి అట – నా ముందు ఎన్నోతరంవాడో – ఆ నిధిని ఒక ఇత్తడి పెట్టెలో పెట్టి నిక్షిప్తంచేసి వెళ్లాడు. ఆ నిధి విలువ మొత్తాన్ని నేను అంచనా కట్టేలోపలే నేను గతిస్తున్నాను. ఇంక దాన్ని నీకు అప్పగిస్తున్నాను. నువు వేదవేత్తవు అవ్వగా చూడగలిగాను గానీ ఈ నిధిభోక్తవు అవ్వగా చూడలేకపోతున్నాను.

బాబూ, ఇంకొక్కమాట. సనాతన ధర్మాన్ని ద్వేషించే వాళ్లకెవ్వరికీ ఈ నిధిలో భాగం పంచకు. అసలు వాళ్లకెవ్వరికీ దీన్ని ఏమాత్రమూ అందనివ్వకు. ఏకారణంచేతనైనా నువ్వు దరిద్రుడివే అయితేకూడా లోభానికి పాల్పడి ఈ నిధిని అమ్మకు. అసలు ఎన్ని నిధులున్నప్పటికీ బ్రాహ్మణుడు నిత్యదరిద్రుడు నాయనా! బ్రాహ్మణుడి కున్న ఒకే ఒక్క మహాసంపద వాడి యజ్ఞోపవీతమే! వాడి ధ్యేయం సనాతనధర్మ రక్షణం. భూమిమీదున్న మహానుభావుల్నీ గోవుల్నీ కాపాడుతూండమని నిత్యమూ భగవంతుని ప్రార్థిస్తూండటమే అతని విధి. కనక ఆ విధిని నిర్వర్తించుకుంటూ ఈ నిధిని రక్షించుకో. నీ తర్వాత ఈ మహాసంపదను నీ కింది తరాలవాళ్లకు కూడా అందివ్వు." అన్నాడు. అప్పటికప్పుడు యాగశాల నేలను తవ్వి ఈ ఇత్తడి పేటికను తీసి నాచేతికిచ్చాడు. వెంటనే కన్ను మూశాడు.

ఎవరో ఫౌజుదారట, సీమలను కొల్లగొట్టుకుంటూ సైన్యంతో వస్తున్నాడని తెలిసింది. వెంటనే రాజమహేంద్రవరం నించి ఈ ద్రాక్షారామానికి నా నివాసాన్ని మార్చాను. కానీ ఇక్కడా నాకు మనశ్శాంతి లేదు. నా ఇద్దరు కొడుకులూ వేద పరీక్ష నిమిత్తం మహారాష్ట్రంలోని తెలుంగువాడకు వెళ్లారు. అక్కడ శివాజీ అనే హిందూరాజు సనాతనధర్మ రక్షణకు కంకణం కట్టుకొన్నాడట. నేను అకాలమరణం పొందే నిమిత్తాలు ఎన్నో రాత్రివేళల్లో నాకు గోచరిస్తున్నాయి. నా తండ్రికి రెండో మాసికం పెట్టకుండానే నేను గతిస్తానేమో !

కనక ఈ నిధిని నేను ఈ ద్రాక్షారామంలో నాఇంట్లో పూజా మందిరం నేలలో నిక్షిప్తంచేస్తున్నాను. ఈ నిధికి చాముండాదేవిని రక్షకురాలిగా నియమిస్తున్నాను. రెండువందల ఏండ్లవరకూ ఈమె ఇక్కడ ఉండేందుకు అవసరమైన జపహోమార్చనావిధిని సక్రమంగా నిన్నటితో పూర్తిచేయించాను.

ఇద మహో మమ శాసనమ్: ఈ రెండువందల ఏండ్లకాలంలోనూ సనాతన ధర్మవ్యతిరేకి ఎవడైనా ఈనిధిని స్పృశించినట్లైతే వాడు వారం రోజుల్లో మరణిస్తాడు. అతడి వంశం నిర్మూలన మవుతుంది. తథాస్తు ! తథాస్తు , తథాస్తు !

ఏహి, ఏహి, చాముండే ! ఆవహ ! ఆవహ !
అత్ర స్థిరాసనం కురు !
విశ్వస్య కళ్యాణార్థం ఏతన్నిధి పరిరక్షణం కురు!
కురు, కురు స్వాహా ! ఇదం న మమ !

లచ్చమ్మ మళ్లీ కళ్లజోడు తీసి కళ్లు తుడుచుకుంది. ఏనాడో తడారిపోయిన డెబ్భయ్యేళ్ల ఆమెకళ్లు ఇన్నాళ్లకి మళ్లీబాష్పాలు- ఉద్వేగంతో కూడిన ఆనందబాష్పాలు -రాలుస్తున్నాయి !

రామేశం అవాక్కయిపోయాడు. భయమూ, ఉద్వేగమూ సమ్మిళితమైన గొంతుతో "ఈ చాముండేశ్వరి నన్ను పట్టుకోదుగదా ! " అన్నాడు,

లచ్చమ్మ నవ్వింది "ఎట్లాపుట్టావురా పిరికిసన్నాసీ ఈ వంశంలో !.... అదేదయినా జరిగుంటే నీ ముత్తాతగారు శివప్రసాదశాస్త్రి గారికే జరిగుండేది గదా ! మరి... అక్కణ్ణించీ నేనెరుగుదును, నీ వంశం మలినంకాలేదు- నమ్మునాయనా ! "

ఆ వృద్ధమాత నోటివెంట అవాచ్యం వచ్చినందుకు రామేశం కంగారు పడ్డాడు. " అహఁహ, అదికాదే నేననేది " అన్నాడు.

" సర్లె, నీ కుసన్దేహాలాపి, ఇంకాఏమున్నాయో తీసి చదువు." అంది లచ్చమ్మ.

రామేశం ఇంకో కాగితం తీసి చదవటం మొదలుపెట్టాడు.

'బృహస్పతి వంశజేన, భారద్వాజ గోత్రేణ, సాంఖ్యాయన సోమయాజినా శాలివాహనశకే, సప్తశతతమే. కాళయుక్తినామ్ని సంవత్సరే కార్తీకపౌర్ణమ్యాం విరచితమ్ శాసనమ్-మమ తు గర్వకారణమ్, మత్కృతం మద్వంశ పూర్వగైః సంఘసేవనమ్ నిస్వార్థమ్ ఆజీవిత పరిశ్రమయాత్తైః సంపాదితానిధిఃమే ప్రాప్తా పూర్వపుణ్యేన....'

లచ్చమ్మ చటుక్కున అంది "ఆ సంస్కృతం నాకే మర్థమవుతుందిరా! కావ్యాలు చదువుకొన్నవాడివి, తెలుగులోకి అనువాదం చేసి చదవరా నాయనా!"

"సర్లె" అన్నాడు రామేశం. తెలుగులో చెప్పటం మొదలుపెట్టాడు.

* * *

'శాలివాహనశకంలో ఏడువందల సంవత్సరమైన కాళయుక్తిలో కార్తీకపౌర్ణమినాడు బృహస్పతి వంశజుడు, భారద్వాజ, గోత్రుడు అయిన సాంఖ్యాయన సోమయాజిచేత రాయబడిన శాసనము. నా వంశంలో పూర్వీకులు నిస్వార్థంగా చేసిన సంఘసేవ నాకు గర్వం

కలిగిస్తోంది. జీవితాంతం శ్రమపడి వాళ్ళు సంపాదించిన నిధి నాకు లభించటం నా పూర్వపుణ్యం. కానీ ఆ నిధిని వాడుకునే విషయంలో కాలం అనుకూలంగా లేదు. క్షీణిస్తున్న బౌద్ధం ఆరిపోతున్న దీపం లాగా భగ్గుమంటున్నది. వేదవేదాంగ వేత్తా వైదిక బ్రాహ్మణుడూ, వేంగిక్షేత్రంలోని బౌద్ధారామ ప్రధానాచార్యుడూ అయిన దిఙ్నాగుడు ఏనాడో గతించాడు అయినా అతని ప్రభావం ఇప్పటికీ చాలాబలంగా ఉంది. వైదికమతానికి చేటుకాలం ఇంకాపోలేదు. ఉత్సవసమయాల్లో తీర్థాల్లోకి దేవాలయాల్లోకి ప్రవేశించి బౌద్ధభిక్షువులు చేసే నాస్తిక వాదనలూ హడావుడులూ ఇంకా తగ్గలేదు. ఈ వేదసీమలోని గురుకులాల పక్కనే బౌద్ధరామాలు ఇంకా క్షీణించలేదు. వాటిల్లో బౌద్ధ త్రిపిటికాలూ, జాతక కథలూ, వాటి వ్యాఖ్యానాలూ ఇంకా బోధింపబడుతూనే ఉన్నాయి. వైదిక కుటుంబాల్లోనివారు కొందరు అట్లాగే మిగిలిపోగా మిగిలినవారు బౌద్ధాన్ని స్వీకరించటం ఈ ప్రాంతాల్లో ఇంకా జరుగుతూనే ఉన్నది. పరమ వైదిక నిష్ఠాపరుడూ, కాళికను ప్రసన్నం చేసుకున్నవాడూ మహాకవీ అయిన కాళిదాసు రచనలనే ఆ దిఙ్నాగుడు పరిహసించాడు. గురువు తర్వాత అతని శిష్యుడు ధర్మకీర్తి ఇప్పుడు గురువు పనిని కొనసాగిస్తున్నాడు. ఆ దిఙ్నాగుడు రాసిన తర్కశాస్త్ర సముచ్చయానికీ బౌద్ధగ్రంథాలకీ తప్ప మరి ఏ ఇతర శాస్త్రానికీ రోజులు అనుకూలంగా కనిపించటంలేదు.

ఈ స్థితిలో నా పూర్వీకులు నాకందించిన మహోదధివంటి ఈ మహానిధిని నేను ఎట్లా బయటపెట్టను? — ఇది మామూలు ద్రవ్యనిధి కాదే!— ఆయుర్వేద, ఖగోళ, అణుశాస్త్రాల నిధి !

నా పూర్వీకులెవ్వరో కొన్నివందల ఏండ్లనాడు అపర ధన్వంతరి అయిన శుశ్రుతుని సేవచేసారు. అథర్వ, ఋగ్వేదాల్లోని ఔషధ ప్రక్రియలపైనా, పుత్తెలను కోసే శల్యతంత్రం పైనా తాము చేసిన పరిశోధనలను వారు గ్రంథస్థంచేసారు. అదే ఈ ఆయుర్వేద గ్రంథం. ఇంక, సూర్యునిలోని మచ్చలను గూర్చి, నక్షత్రమండలాల్లో చెలరేగే అలజడులను గూర్చి జరిగిన పరిశోధనలను తెలియపరిచేది ఈ ఖగోళ శాస్త్రగ్రంథం. స్థావర జంగమాలైన వివిధ వస్తు సంచయాల్లోని అణువుల కూర్పులపైనా, అణు విచ్ఛేదంవల్ల విడుదలయే శక్తిరూపాల పైనా జరిగిన పరిశోధనల ఫలితమే ఈ అణుశాస్త్ర గ్రంథం. కణాదుని వైశేషిక శాస్త్రానికి నా వంశజులెవ్వరో చేసిన వ్యాఖ్యానం ఇది.— ఈ విధంగా మూడు శాస్త్రగ్రంథాలూ అద్భుతమైనవి. అపురూపమైనవు. అయితే వీటిని గురుకులాల్లో అధ్యయనం చేయించటానికి ఇది తగిన సమయంకాదు. నా రేండేళ్ళ కొడుకు పెరిగిపెద్దవాడయ్యేదాకా బతికుంటాననే నమ్మకం నాకులేదు. తాను ఈ నిధినికాపాడతానని మాటివ్వటానికి కాలపరిస్థితిని బట్టి ప్రతి పండితుడూ వెనుకంజ వేస్తున్నాడు.

కనక, నా ముందుతరం వాళ్ళకి దీన్ని అందించే ప్రయత్నం చేస్తున్నాను. రాగిరేకులమీద రాసున్న ఈ మూడు శాస్త్రాలనీ నే ఇత్తడిపెట్టెలోపెట్టి భూమిలో నిక్షిప్తం చేస్తున్నాను. అనుకూలకాలం వచ్చినప్పుడు ఈ గ్రంధాలు ప్రచారంలో కొస్తాయి. ఈ ఆర్షభూమి వీటివల్లవిజ్ఞానం వెల్లివిరుస్తుంది. సమస్తమావనకోటీ ఆరోగ్యవిజ్ఞానాల తులతూగుతుంది. అంతవరకూ ఆ సర్వేశ్వరుడు ఈ గ్రంధాలను—నిధిని కాపాడుగాక?— ఓం తత్సత్ !'

* * *

గద్గదస్వరంతో లచ్చమ్మ "తియ్యినాయనా ! పై అ జాగ్రత్తగా తియ్యి" అంది.

రామేశం మళ్ళీ పెట్టెకు నాలుగు వైపులా గుంద్రాయిత కొట్టాడు. పైన అడ్డంగా పెట్టున్న రేకు ఊడొచ్చింది. దాన్నెత్తగా ఇందాకటి వాసన మళ్ళీ గుప్పుమంది. మూలికల కింద రాగిరేకులక లున్నాయి. కొన్ని రేకులు ఒకదానికొకటి అంటుకుని శిథిలమవ్వబోయే స్థితిలో ఉన్నాయి.

రామేశం అన్నాడు "బంగారమో వెండో ఉంటుందని ఆ పడ్డానమ్మా ! దొరికిన నిధి రాగిరేకులా !"

లచ్చమ్మ నొచ్చుకుంది బాధ వ్యక్తపరిచింది. అంది. ఇంత చదువుకున్నవాడివి, లెక్చరరు ఉద్యోగం చేస్తున్నవాడివి, వెండీ బంగారాలే ప్రధానమన్నట్టు మాట్లాడుతున్నావా నాయనా ! సమస్త సంపదల్నీ పుట్టించేది విజ్ఞానం కాదా ? ఆ విజ్ఞానాన్ని నీ పూర్వీకులు స్వంతం చేసుకున్నారు. దాన్ని నీ కందించారు. ఇంతకన్నా ఏం కావాలి నాయనా ? దాన్ని నీకందించటానికి వాళ్లుపడ్డ యాతన చూశావా ? ఎన్ని కాలాల్లో ఎన్ని విపత్తుల్నించి దాన్ని కాపాడారో గమనించావా ? .... ఇంతాచేసి నీ వంశంకోసం మాత్రమే అనకుండా సమస్తమానవాళి సుఖశాంతులకోసమూ ఈ శ్రమ పడ్డామని చెప్పారే దీన్నిబట్టి తెలీటం లేదా వాళ్లెంత త్యాగధనులో, అది ఎంత మహోత్కృష్టమైననిధో ! ఈనాడు విజ్ఞానంలో మనకంటే ఎన్నోరెట్లు ముందుకుపోయారు ఇతరదేశాలవాళ్ళు. ఎంతో వెనకబడిపోయాం మనం. మనం ఆ విజ్ఞానం కోసం దేవురిస్తూ వాళ్ళ కాళ్ళదగ్గర పడిగాపులు కాయటమా, మన స్వంతమైన దాన్ని అభివృద్ధిచేసుకుని వాళ్ల కన్నా గొప్పగా తిరిగి ఇంకోసారి ఇంకో వెలుగు వెలగటమా ఏది ఉత్తమ మంటావు ? ... ఈ నిధిని నీకు నీ పూర్వీకులు ఎందుకు అందించారో తెలిసిందా నాయనా ?"

రామేశం అవాక్కయ్యాడు. తన ముదుసలి తల్లికి ఇంత ఆలోచనుండడంలో ఆశ్చర్యం లేదనిపించిందతనికి. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న తన తండ్రి ప్రభావం తన తల్లిమీద ఉందనే విషయం అతనికి తెలిసిందే.

*          *          *

తెల్లవారింది.

స్నానమూ ధ్యానమూ ముగించుకొని ప్రయాణమై బయల్దేరాడు రామేశం. చెప్పుల్లో కాళ్లు పెడుతుండగా, చదువుధ్యాస ఉన్న అతని నాలుగో కొడుకు- అయిదో తరగతి చదువుతున్నవాడు : గొంతెత్తి శబ్దమంజరి కంఠస్థం చేస్తున్నాడు: ఋకారాన్తః పుంలిగో కర్తృశబ్దః చేయువాడు. కర్తా-కర్తారౌ-కర్తారః ప్రథమా విభక్తిః''

రామేశం వెనక్కి తిరిగి కొడుకుతో “ నాన్నా గొప్ప గొప్ప గ్రంథాలున్నాయి మనింట్లో. చదువుకుంటావా ? గొప్పవాడివవుతావు మరి. నువ్వు చదువకపోతే ఇంకోళ్లెవరో చదివి గొప్పవాళ్లవుతారు ” అన్నాడు.

వాడు తలెత్తి నాలుగుక్షణాలు చూసి చూసి “ మరయితే మా హెడ్‌మాష్టారికన్నా గొప్ప వాణ్ణవుతానా ? ” అన్నాడు.

“ ఆఁ ,తప్పకుండా ! ఇంకా చాలా చాలా గొప్పవాడివవుతావు”

వాడికళ్లుమెరిసాయి. “ అయితే చదువుకుంటాను. ”

రెట్టింపుగా మెరిసాయి రామేశం కళ్లు.

చటుక్కున వెనక్కొచ్చి కొడుకుని హత్తుకున్నాడు.

రిక్షావాడు ఇంకోడి సహాయంతో ఆ బరువు ఇత్తడిపెట్టెను రిక్షాలో పెడుతూండగా “అమ్మా తిరుపతి వెడుతున్నానే. ప్రాచ్య లిఖిత భాండాగారం పండితులచేత వీటని పరిశీలన చేయిస్తాను. వారం పదిరోజులు పట్టొచ్చు. ఉత్తరం రాస్తాను ... తలుపేసుకో ... విజయవాడ పాసింజరు వెళ్లిందిరా అబ్బాయి ? అంటూ హడావుడిగా వెళ్లి రిక్షా ఎక్కాడు.

# వలపు గంధం!

నల్లని ముంగురుల్లో ముడివేసినా
విశాల నేత్రాల్లో కట్టివేసినా
పొడుగగు ముకు జెలుమల్లో బిగపట్టినా
నున్నని పెదవుల్లో నొక్కిపట్టినా
లోతయిన గుండెల్లో దాచిపెట్టినా
నీ వలపు
“ కస్తూరే ”
నేస్తురాలా !
అది “ గమగమా ” చెన్నొందుతూనే ఉంటుంది !
నాకు
ప్రసన్న మవుతూనే ఉంటుంది !!

# జీవితం !

వెలుగు చీకటుల
సమ్మేళనం
తెలుపు నలుపుల
మిశ్రమం
గంగా యమునల
సంగమం
దీపావళిలా
ఉత్తమాయం
ప్రయాగలా పరమ
పవిత్రం
దాన్ని వ్యర్థపరచటం
నేరం !
పాపం !

శ్రీ కె. కిశోరుంబాబు
శ్రీ కె. అశోకుంబాబు